క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు మండలంలోని చాటగొట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాటగొట్ల పర్యటన తర్వాత దుగ్గుంట పంచాయతీలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ పనులను ప్రారంభిస్తారని దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి తెలియజేశారు.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మి గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉభయకర్తలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

మనుబోలు: మండల కేంద్రంలో సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే శోభాయాత్రను జయప్రదం చేయాలని ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము కోరారు. సోమవారం ఆయన మనుబోలులో యాత్ర నిర్వహణకు గ్రామస్తుల నుంచి నిధులు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధార్మిక సమ్మేళనంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ నుంచి శోభాయాత్ర ప్రారంభమై శివాలయం వరకూ కొనసాగుతుందని తెలిపారు.

నేటి నుంచే ఆడుదాం ఆంధ్రా పోటీలు

మనుబోలు: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టారన్నారు. 123 టీంలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో క్రికెట్‌లో 32, బ్యాడ్మింటన్‌లో 39, వాలీబాల్‌లో 17, కబడ్డీలో 25, ఖోఖోలో 10 టీంలు పోటీపడుతున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాల్లో మంచినీటి వసతి, స్నాక్స్ ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మంత్రిని కలిసిన ఎంపీపీ



ముత్తుకూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ముత్తుకూరు మండల ఎంపీపీ గండవరం సుగుణమ్మ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెకు పదవి వచ్చిన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరులో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కార్యదర్శి ప్రతిభ



పతకాలు సాధించిన వెంకటేశ్వర్లు

ముత్తుకూరు: 43వ ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ముత్తుకూరు పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు ప్రతిభ చూపారు. రామాయపట్నంలో ఆది, సోమవారాల్లో ఈ టోర్నమెంట్ జరిగింది. ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తితో ఆయన మన జిల్లా నుంచి ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 100 మీటర్ల రన్నింగ్ రేస్‌లో 3వ స్థానం, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం సాధించారు. అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యదర్శి మంగ వరప్రసాద్ నుంచి పతకాలు స్వీకరించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



మనుబోలు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఓడూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి, ఇరగరాజు వెంకయ్య, బిరదవోలు అజయ్‌కుమార్‌రెడ్డి, తురక అంకయ్య, ఎస్ఎస్ఎఫ్ నాయకులు గణపతి, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ఆనందం



కొడవలూరులో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కొవ్వొత్తులు వెలిగించిన క్రైస్తవులు



వెంకటాచలం: ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



పొదలకూరులోని చర్చి



విడవలూరు: కేక్ కట్ చేస్తున్న లూకరాజు



వెంకటాచలం: ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



టీపీగూడూరు: అన్నదానం చేస్తున్న దృశ్యం



మనుబోలు: స్వీట్ ప్యాకెట్లు అందజేస్తున్న సేవానాథం ట్రస్ట్ సభ్యులు

వెంకటాచలం: మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వెంకటాచలం, నిడిగుంటపాళెం, కసుపూరు, కసుమూరు, తిక్కవరప్పాడు, సర్వేపల్లి, ఇస్కపాళెం తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. జోసఫ్‌పేట, వెంకటాచలం తదితర చోట్ల మధ్యాహ్నం ప్రార్థనలు చేసి అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు.

➡ పొదలకూరు: పట్టణంలోని జాన్‌జాకబ్ లూథరన్, క్యాథలిక్ చర్చిల్లో సోమవారం ప్రార్థనలు జరిగాయి. ప్రత్యేక గీతాలను ఆలపించారు. పాస్టర్లు సందేశమిచ్చారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

➡ విడవలూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక హరిజనవాడలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సంఘస్తులు వేడుకలు నిర్వహించారు. సంఘ కాపరి లూకరాజు క్రీస్తు పుట్టుక పరమార్థం గురించి వివరించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

➡ ఇందుకూరుపేట: క్రిస్మస్ పర్వదినాన్ని మండలంలోని క్రైస్తవులు సోమవారం ఘనంగా చేసుకున్నారు. ఇందుకూరుపేట, కొత్తూరు, జగదేవిపేట, పల్లిపాడు, నిడిముసలి, ముదివర్తిపాళెం, కుడితిపాళెం, గంగపట్నం, మైపాడు, కొరుటూరు, నరసాపురం, కొమరిక, జంగంవానిదొరువు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ముత్తుకూరు: నేలటూరులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

➡ ముత్తుకూరు: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే పండగ వాతావరణం నెలకొంది. సోమవారం కేక్‌లు కట్ చేశారు. పిడతాపోలూరు, ముత్తుకూరు, వల్లూరు, గోపాలపురం, పంటపాళెం, పైనాపురం, మామిడిపూడి, బ్రహ్మదేవి, డమ్మాయపాళెం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మతపెద్దలు క్రీస్తు బోధనలను భక్తులకు వివరించారు.

➡ మనుబోలు: మనుబోలు దళితవాడ చర్చిని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. సోమవారం పాస్టర్ పీటర్ పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సందేశాన్ని వినిపించారు. శ్రీ సేవానాథం ట్రస్ట్ తరఫున స్వీట్లు పంపిణీ చేశారు. కోదండరామపురం, కాగితాలపూరు, కొమ్మలపూడి, బద్దెవోలు, వెంకన్నపాళెం, కొలనకుదురు, చెర్లోపల్లి, పిడూరు, జట్లకొండూరు, కొమ్మలపూడి, గురివిందపూడి, కొలనకుదురు తదితర గ్రామాల్లో పాస్టర్లు ఫ్రాంక్లిన్, ఖన్న పాల్, మధుబాబు, ఎలీసా, శేషయ్య, శాండీ తదితరులు ప్రార్థనలు చేశారు.

➡ తోటపల్లిగూడూరు: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నరుకూరు గ్రామానికి చెందిన క్రైస్తవులు ఇస్కపాళెంలోని కృపా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కోడూరు సాగర తీరంలో ఉన్న వేళాంగణి మాత పుణ్యక్షేత్రంలో చర్చి డైరెక్టర్ లూకస్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే తోటపల్లిగూడూరులోని మరియమాత పుణ్యక్షేత్రం, నరుకూరులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిల్లో వేడుకలు జరిగాయి.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోలని పెనుబల్లి గ్రామం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతికి చిహ్నంగా కొవ్వొత్తులు వెలిగించారు. అన్నదానం చేశారు. అనంతరం పాస్టర్ మోష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దానగుణం, దయ, ప్రేమ కలిగి ఉండాలన్నారు.

➡ కొడవలూరు: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. నార్తురాజుపాళెంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో రిటైర్డ్ అధ్యాపకుడు జీపీ నాగేశ్వరరావు ముఖ్యవక్తగా వచ్చి ప్రసంగించారు. చర్చి పాస్టర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌నాథ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న మంత్రి

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగణిమాత చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత చర్చి డైరెక్టర్, ఫాదర్ లూకాస్‌రాజ్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. కాకాణి కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ మానవాళికి ఏసుక్రీస్తు ఇచ్చిన సందేశం ఆదర్శప్రాయమన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు, రైతాంగానికి ఎల్లవేళలా ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, స్థానిక నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం చిరంజీవులగౌడ్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి దుంపల ఏసోబు, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్య గౌడ్, దువ్వూరు గంగాధర్‌రెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, ఆకుల మధు, ఎడిచర్ల శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

మనుబోలు: కేసులను త్వరగా పరిష్కరించాలని సీఐ రాంబాబు అన్నారు. పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన సోమవారం మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసులను రోజుల తరబడి సాగదీయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎస్సై అజయ్‌కుమార్‌కు సూచనలిచ్చారు.

మొక్కల పెంపకంపై దృష్టి



ఇనుకుర్తి నర్సరీలో వివిధ రకాల మొక్కలు



నీడనిచ్చే కానుగ మొక్కలు



రోడ్ అవెన్యూలో మొక్కలు

- ఇనుకుర్తి నర్సరీకి గుర్తింపు

పొదలకూరు: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రైతుల పొలాల గట్లతోపాటు, జగనన్న పచ్చతోరణం కార్యక్రమానికి వివిధ రకాల మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం పేరుతో పేదల ఇంటి స్థలాల లేఅవుట్లలో మొక్కలు నాటుతున్నారు. వాటిని ఉచితంగా పంపిణీ చేసేందుకు సామాజిక అటవీ శాఖ అధికారులు సిద్ధంగా ఉంచారు. పొదలకూరు మండలం ఇనుకుర్తిలో సోషల్ ఫారెస్ట్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలను పెంచుతున్నారు. కావాల్సిన వారు సంబంధిత అధికారులతో మాట్లాడి ఉచితంగా తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది. సుమారు మూడు దశాబ్దాలుగా నర్సరీలో రకరకాల నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు.

పచ్చదనం పరిచే మొక్కలు

ఏటా వేల సంఖ్యలో మొక్కలను పెంచి ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తున్నారు. నీడినిచ్చే మొక్కలే కాక పండ్ల మొక్కలు కూడా ఇక్కడ లభ్యమవుతున్నాయి. ఎర్రతురాయి, పచ్చతురాయి, నిద్రగన్నేరు, చింత, నేరేడు, గంగరావి తదితరాలున్నాయి. ప్రభుత్వ లేఅవుట్లకు మొక్కలను అందజేసేందుకు సామాజిక అటవీశాఖ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇనుకుర్తి నర్సరీలో చిన్న మొక్కలు 60 వేలు, పెద్ద మొక్కలు 10 వేలున్నాయి. ఎర్రచందనం మొక్కల కోసం నారు పోశారు.

అందుబాటులో మొక్కలు

నర్సరీలో అందుబాటులో మొక్కలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, జగనన్న లేఅవుట్లకు అవసరమైతే ఉచితంగా అందజేస్తున్నాం. పాఠశాలల్లో పచ్చదనం కోసం కూడా మొక్కలు అందుబాటులో ఉంచాం.

– అంకయ్య, సెక్షన్ ఆఫీసర్, సోషల్ ఫారెస్ట్

‘టీడీపీ, జనసేన నేతల్ని ప్రజలు నమ్మడం లేదు’



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: తెలుగుదేశం, జనసేన పార్టీలను ప్రజలు నమ్మడం లేదని, ఆ పార్టీల నాయకులు ఉనికి కాపాడుకునేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని డీఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుడు దినేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎఫ్‌డీఆర్ నిధులతో నందలగుంట దగ్గర రూ.కోటితో పాలిచెర్ల కాలువ పనులు చేపట్టామన్నారు. పడుగుపాడు చంద్రమౌళి నగర్ గిరిజనకాలనీ దగ్గర సదరన్ ఛానెల్‌పై చేసిన పనులు దినేష్‌కు కనిపించకపోవడం శోచనీయమన్నారు. కోవూరు నుంచి పాటూరు వెళ్లే మార్గంలో కలుజు వద్ద రూ.2.45 కోట్లతో బ్రిడ్జి, మూడు కల్వర్టుల నిర్మాణానికి ఈనెల 29న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జనసేన నాయకులు ఆ పనులేవో వాళ్లు చేస్తున్నట్లు ఫోజులు కొడుతున్నారన్నారు. పోతిరెడ్డిపాళెం వారధి సెంటర్ నుంచి పల్లెపాళెం వరకు 20 సంవత్సరాల క్రితం నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హయాంలోనే రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు దెబ్బతినడంతో 3.6 కి.మీ మేర పనులు జరుగుతున్నాయన్నారు. పాటూరు గ్రామంలోని తూర్పు పల్లిపాళెం నుండి బుచ్చి బాంబే రోడ్డు వరకు 3.5 కి.మీ రోడ్డును అతి త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి తీరును విమర్శించారు. సమావేశంలో మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు చిరంజీవి, విజయ్‌కుమార్, అంజన్‌రావు, ఎంపీటీసీ వేణుగోపాల్, సాయి యశ్వంత్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, పాటూరు వార్డు సభ్యుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోల ఢీ

సోమశిల: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన సోమశిల సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పాల క్యాన్లతో వెళ్తున్న ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. మరో ఆటోలో ప్రయాణిస్తున్న మస్తాన్, నందిని స్వల్ప గాయాలయ్యాయి.

దుస్తుల వితరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని సుబేదారుపేటలో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ ఏవీకే ఫౌండేషన్ అధినేత విజయకుమార్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే అల్పాహారం పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం ఘంటసాల గీతాలను ఆలపించామన్నారు.

నుడా చైర్మన్‌కు డిప్యూటీ మేయర్ అభినందన

నెల్లూరు(దర్గామిట్ట) : నుడా చైర్మన్‌గా రెండోసారి నియమితులైన ముక్కాల ద్వారకానాథ్‌ను ఆయన నివాసంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మూలస్థానేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఎస్సార్ ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనారిటీ నేత షేక్ హాజీ ఉన్నారు.

నాగులవరం సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం సమీపంలో డీఎం ఛానెల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. పసుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సుమారు నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గేదెను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

ఆత్మకూరు: మోటార్‌బైక్‌పై వస్తూ గేదెను ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నెల్లూరుపాళెం వద్ద జరిగింది. స్థానిక వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే ఎం.ఉమేష్ తన ఇంటి నుంచి ఆత్మకూరుకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టి రోడ్డు మీద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో గేదె మృతిచెందింది. క్షతగాత్రుడిని సమీపంలోని ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనం ద్వారా నెల్లూరుకు తరలించారు.

ప్రణాళికాబద్ధంగా క్రీడా పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులకు సూచించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ ఏర్పాట్లను కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 333 మైదానాలను క్రీడలకు అనువుగా సిద్ధం చేసినట్లు చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

నగదు ప్రోత్సాహకాల అందజేత



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున విద్యా ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వైద్య, ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న వారికి రూ.1.60 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన మందిరం అధ్యక్షుడు పారా గురువెంకట శ్రీధర్‌శర్మ, కోట శ్రీరామమూర్తి, జి.వరప్రసాదరావు, బీవీకే సుందరరావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాపత్తు ఉత్సవాలు



ఉభయదేవేరులతో తల్పగిరి రంగనాథుడు



ఉభయదేవేరులతో వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వైష్ణవాలయాల్లో పదిరోజులపాటు నిర్వహించే రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన సోమవారం శ్రీవారు విశేషాలంకారాల్లో ఉభయదేవేరులతో కొలువై భక్తులను అనుగ్రహించారు. రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి విశేషాలంకరణలో కొలువుదీరారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాన్ని ఉభయకర్తలుగా గుర్రం రామానుజంశెట్టి, మంగతాయారమ్మ జ్ఞాపకార్థం మనుమలు వ్యవహరించారు. మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉభయకర్తగా పద్మావతి వ్యవహరించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మూడు రోజుల పాటు జరిగే చందనోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు సోమవారం అయ్యప్పస్వామికి కేరళ సంప్రదాయ రీతిలో, శాస్త్రోక్తంగా అభిషేకం, హోమం, పూజాదికాలు, ప్రాకారోత్సవం కనులపండువగా జరిగింది. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం, భిక్షను స్వీకరించారు. ఉభయకర్తలుగా కుందా సూర్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ, ప్రదీప్, సింధూరలక్ష్మి, కురుగొండ్ల రామకృష్ణ, సింధు అల్లాడిహేమ, వేలూరు మునుస్వామి, మల్లీశ్వరి, బుట్టా రంగయ్య, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, జి.రత్నయ్య, విజయన్, కె.మోహన్‌రావు, కేజీ శంకరన్, బి.మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

వైభవంగా గంధ మహోత్సవం



గంధం తీసుకెళ్తున్న మతపెద్దలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఖాజానగర్‌లోని దర్గాలో సోమవారం గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని గంధం స్వీకరించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మతపెద్ద ఖాజాఅబుల్ ఇర్ఫాన్‌షా, మహ్మద్ అబ్దుల్ అజీజ్, స్థానికులు పాల్గొన్నారు.